క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు నివాళి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ భరత్

గుడుపల్లె: మండలంలోని సంగనపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ క్రియాశీలక కార్యకర్త వరదరాజులు (65) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. విషయం తెలిసి జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్సీ భరత్ అక్కడికి వెళ్లి భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పరిసరాల శుభ్రతతో వ్యాధులు దూరం



వైద్యశిబిరంలో వైద్య సిబ్బంది

గంగవరం: పరిసరాల శుభ్రతతో వ్యాధులు రాకుండా నివారించవచ్చని వైద్యాధికారి శ్రీనివాసులు తెలిపారు. స్థానిక పీహెచ్‌సీ పరిధిలోని పలు గ్రామాల్లో 104 మెడికల్ క్యాంపును గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామాల్లో ప్రజలకు వైద్యపరీక్షలు మందులు పంపిణీ చేశారు. అలాగే గర్భిణులు, బాలింతలకు వైద్యపరీక్షలు నిర్వహించి ఐరన్, క్యాల్షియం మందులను అందజేశారు.

విద్యుత్‌షాక్‌తో ఆవు మృతి



మృతిచెందిన పాడిఆవు

బైరెడ్డిపల్లె: విద్యుత్‌షాక్‌తో పాడిఆవు మృతిచెందిన సంఘటన గౌనితిమ్మేపల్లెలో గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన జమీల్‌సాబ్ జీవనోపాధి కోసం రూ.70 వేలతో పాడిఆవును కొనుగోలు చేశాడు. రోజూ ఇచ్చే 7 లీటర్ల పాలతో కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గురువారం సాయంత్రం గ్రామ సమీపంలోని వరదప్పచెరువు వద్ద రైతు వ్యవసాయబోరుకు ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఆవు మేస్తుండగా విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందింది. కుటుంబానికి ఆసరాగా ఉన్న పాడి ఆవు మృతిచెందడంతో జీవనోపాధి కోల్పోయానని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరారు.

గర్భిణులు జాగ్రత్తలు తీసుకోవాలి



ర్యాలీ చేస్తున్న వైద్యసిబ్బంది

పులిచెర్ల(కల్లూరు): బీపీ ఎక్కువగా ఉంటే గర్భిణులు వెంటనే వైద్యులను సంప్రదించాలని కల్లూరు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డా.జానకీరావు సూచించారు. గురువారం కల్లూరు పీహెచ్‌సీలో ప్రపంచ ప్రీ ఎక్లంప్సియాపై సిబ్బందితో అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యులు సుజిత, సుబ్రమణ్యం సిబ్బంది పాల్గొన్నారు.

అధిక రుసుం వసూలు చేస్తే చర్యలు

- సిబ్బందిని హెచ్చరించిన తహసీల్దార్
- వసూలు చేసిన సొమ్ము బాధితుడికి తిరిగి చెల్లింపు

చౌడేపల్లె: సచివాలయాల్లో ప్రజల నుంచి రెవెన్యూ సేవల కోసం ప్రభుత్వం నిర్ణయించిన మొత్తం కంటే అధిక రుసుం వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హనుమంతునాయక్ హెచ్చరించారు. గురువారం సాక్షిలో 'సేవల పేరిట వసూళ్ల దందా' అనే శీర్షికన ప్రత్యేక కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. స్పందించిన తహసీల్దార్ చారాల సచివాలయంలోని వెల్ఫేర్ అసిస్టెంట్, వీఆర్వోపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితుడు సుబ్రమణ్యం నుంచి తీసుకున్న నగదులో రేషన్ కార్డు నమోదుకు అయ్యే నగదు మినహా మిగిలిన సొమ్మును చెల్లించారు. వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను పొందేందుకు వచ్చిన వారి నుంచి రెవెన్యూ సిబ్బంది డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపణలున్నాయని, ఇలాంటివి మరోసారి పునరావృతమైతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి సచివాలయంలో సేవలకు చెల్లించాల్సిన రుసుం వివరాలను తెలుపుతూ బోర్డులు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు.

నూతన వధూవరులకు పెద్దిరెడ్డి ఆశీర్వాదం



నూతన వధూవరులతో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి

సదుం: స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో వెంకటరమణ కుమారుడు రవి వివాహ వేడుకలు గురువారం సాయంత్రం జరిగాయి. ఈ వేడుకలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

• నిర్లక్ష్యానికి నిలువుటద్దం



స్థానిక ప్రభుత్వాస్పత్రి ఆవరణలో డాక్టర్ గది పక్కనున్న భవనం గోడలను చీల్చుకొంటూ ఏపుగా రావిచెట్టు పెరిగిపోతోంది. రావిచెట్టు పెరుగుతున్నా దాన్ని తొలగించడంలో సిబ్బంది నిర్లక్ష్యమే ఈ దృశ్యం. ప్రభుత్వ ఆస్తులను సంరక్షించడంలో అధికారుల అలసత్వానికి అద్దం పట్టినట్లు ఉన్న ఈ చిత్రాన్ని సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

– చౌడేపల్లె

• ప్రమాదకర ట్రాన్స్‌ఫార్మర్



ప్రమాదం జరిగితే కానీ విద్యుత్‌శాఖ అధికారుల స్పందించరా అంటూ ప్రజలు మండిపడుతున్నారు. మండలంలోని ఓదులపేట చెర్వు వద్ద రెండు ట్రాన్స్‌ఫార్మర్లను రాతి బండపై అమర్చారు. ఓ వైపు శిథిలావస్థకు చేరుకున్న దిమ్మెకు బండను పెట్టి ఇలా పెట్టడం, విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్నాయి. ప్రమాదం సంభవించకముందే అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

– చౌడేపల్లె

• అల్లుకున్నా పట్టించుకోరా?



కొండయ్యగారిపల్లెలో విద్యుత్ స్తంభానికి తీగలు ప్రమాదకరంగా అల్లుకుని విద్యుత్ తీగలపై ముందుకు వెళ్తున్నాయి. తీగలు ఫేజ్, ఎర్త్ సరఫరా అయ్యే తీగలకు చుట్టుముట్టాయి. ప్రమాదం సంభవించకముందే అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. – చౌడేపల్లె

• నిరాశ పంట



రేయింబవళ్లు కష్టపడి, పంట సాగు కోసం లక్షల్లో పెట్టుబడి ఖర్చు చేసి ఆశించిన స్థాయిలో దిగుబడి పొందినా రైతులకు గిట్టుబాటు ధరలేకపోవడంతో టమాట రైతుకు నిరాశే ఎదురైంది. పుంగనూరు మండలం చదళ్ల సమీపంలోని ఓ రైతు టమాట పంటను కోయకుండా ఏకంగా కాయలు సహా చెట్లను సైతం పీకి పడేశారు. ఇది చూసిన పలువురు అయ్యో రైతు ఈ ఏట నిలువునా మునిగిపోయారే అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. – చౌడేపల్లె

ముగిసిన పటాలమ్మ జాతర



అమ్మవారి శిరస్సును జలధికి తీసుకెళుతున్న గ్రామస్తులు

పెద్దపంజాణి: పటాలమ్మ గంగమ్మ జాతరలో భాగంగా రాయలపేట గ్రామంలో మూడవ రోజు గురువారం అమ్మవారి జలధి కార్యక్రమాన్ని కోలాహలంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారి శిరస్సును గ్రామంలో ఊరేగించారు. భక్తులు అమ్మవారికి కర్పూర హారతులిచ్చి, కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించారు. అనంతరం అమ్మవారి జలధి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద హుండీ లెక్కింపు, అమ్మవారి చీరల వేలం పాట నిర్వహించారు.

హుండీ ఆదాయం రూ.38లక్షలు



కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

కుప్పం: శ్రీప్రసన్న తిరుపతి గంగమాంబ జాతర హుండీ ఆదాయం రూ.38 లక్షలు లభించినట్లు ఆలయ కమిటీ తెలిపింది. గురువారం తిరుపతి గంగమ్మ ఆలయ ప్రాంగణంలో హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని దేవదాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. సాయంకాలం వరకు లెక్కింపు కొనసాగగా నగదు ద్వారా రూ.38లక్షల నగదు, 95 గ్రాముల బంగారం, 620 గ్రాముల వెండి భక్తులు కానుకలుగా వేసినట్లు ఆలయ కమిటీ పేర్కొంది. కానుకల్లో చిల్లర నాణేల లెక్కింపు ఇంకా కొనసాగుతోంది.

ఆగని చింతచెట్ల నరికివేత



కొలింపల్లె వద్ద నరికేసిన చింతచెట్టు

- నరికివేతను అడ్డుకునేదెవరు?
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం
- గుడియాత్తం కూలీలతో రాత్రింబవళ్లు కోత

చౌడేపల్లె: మండలంలో భారీ చింత చెట్ల నరికివేత ఆగడంలేదు. చెట్లను సంరక్షించాల్సిన అటవీ, రెవెన్యూ శాఖ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తూ పచ్చదనాన్ని హరించేస్తున్నా పట్టించుకోవడం లేదు. ఏళ్ల నాటి భారీ వృక్షాలను వంట కలప కోసం నేల కూల్చేస్తున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రజలు అధికారులను ప్రశ్నిస్తున్నారు. గురువారం దిగువపల్లె పంచాయతీ కొలింపల్లె ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో బోయకొండ–చౌడేపల్లె ప్రధాన రహదారి పక్కనే భారీ చెట్లను నేలకొరిగించారు. గుడియాత్తంకు చెందిన కూలీలు రాత్రింబవళ్లు కోసేస్తున్నారు. యథేచ్ఛగా ఎలాంటి అనుమతులు లేకుండా చెట్లను నరికివేస్తూ పచ్చదనాన్ని నాశనం చేస్తున్నా అధికారులు నిద్రావస్థలో ఉన్నారు. రోజూ 3 నుంచి 4 లారీల్లో కలపను తరలించేస్తున్నారు. పచ్చదనాన్ని పరిరక్షించాల్సిన ఓల్టా చట్టం అక్రమార్కులకు చుట్టంలా మారిందని ప్రజలు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ చొరవ తీసుకుని పర్యావరణాన్ని పరిరక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

టమాట పంట గట్టుపాలు




వ్యవసాయ గట్ల మీద వదిలేసిన పంట

- గిట్టుబాటు ధరలేక పొలంలోనే

రొంపిచెర్ల: లక్షలు ఖర్చు చేసి సాగు చేసిన టమాట పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు పొలాల్లోనే వదిలి వేస్తున్నారు. మండలంలో 600 ఎకరాల్లో టమాట పంటను రైతులు సాగు చేశారు. ఎకరా టమాట పంట సాగుకు రూ.లక్ష ఖర్చు అవుతుంది. ఎన్నో కష్టాలు పడి పంట సాగు చేసినా పంట చేతికి వచ్చే సమయంలో ధరలు లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. 30 కిలోల టమాట బాక్స్ రూ.150 ధర పలుకుతుంది. అయితే ఒక బాక్స్ టమాట కోయడానికి కూలీలకు రూ.60 అవుతుంది. అయితే పంట సాగు చేసినా కనీసం కూలీలకు కూడా రావడం లేదన్నారు. దీంతో చేసేది ఏమీలేక పంటను పొలాల్లోనే వదిలి వేయాల్సి వస్తోందని రైతులు విలపిస్తున్నారు. ఒక పక్క ధర పతనం మరో పక్క వర్షంతో పంట పూర్తిగా దెబ్బతిందన్నారు. పంటను పొలంలో వదలలేక కోసి గట్ల మీద పారవేస్తున్నామని రైతులు తెలిపారు. గిట్టుబాటు ధరలు కల్పించాల్సిన ప్రభుత్వం రైతుల వైపు కన్నెత్తి చూడడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం టమాట రైతును ఆదుకోవాలని కోరుతున్నారు.

సచివాలయ వ్యవస్థలో క్లస్టర్ల కుదింపు

- నాలుగు క్లస్టర్లుగా రొంపిచెర్ల మండలం
- పంట నమోదులో సిబ్బంది నిర్లక్ష్యం
- తగ్గిన పోస్టులు
- నిరుపయోగంగా మారనున్న సచివాలయాలు
- లబోదిబోమంటున్న చిరుద్యోగులు



బొమ్మయ్యగారిపల్లె సచివాలయం



రొంపిచెర్ల రైతు సేవా కేంద్రం

రొంపిచెర్ల: సచివాలయ వ్యవస్థలో ప్రభుత్వం నూతనంగా క్లస్టర్లను ఏర్పాటు చేసేందుకు శ్రీకారం చుట్టింది. రొంపిచెర్ల మండలంలో 11 గ్రామ పంచాయతీలలో 8 మంది వీఆర్వోలు పనిచేస్తున్నారు. అయితే ప్రస్తుతం కస్టర్ల విభజనతో మోటుమల్లెల, బొమ్మయ్యగారిపల్లె, చిచ్చిలివారిపల్లె గ్రామాలను పూర్తిగా రద్దు చేసి నూతనంగా గానుగచింత, మోటుమల్లెల ఒక క్లస్టర్‌గాను, బొమ్మయ్యగారిపల్లె, పెద్దగొట్టిగల్లు, బండకిందపల్లె గ్రామాలు ఒక క్లస్టర్‌గాను. రొంపిచెర్ల, బోడిపాటివారిపల్లె, చెంచెంరెడ్డిగారిపల్లె క్లస్టర్‌గాను, పెద్దమెల్లెల, చిచ్చిలివారిపలె, జాండ్లవారిపల్లె గ్రామాలు ఒక క్లస్టర్‌గాను ఏర్పాటు చేస్తున్నారు. దీని కారణంగా మండలంలో మోటుమల్లెల, బొమ్మయ్యగారిపల్లె, చిచ్చిలివారిపల్లె వీఆర్వోలను రేషనలైజేషన్‌లో లేపేశారు. దీని కారణంగా 8 సచివాలయాల్లో 8 మంది వీఆర్వోలు పనిచేస్తుండగా క్లస్టర్ల ఏర్పాటుతో నలుగురు వీఆర్వోలు 8 సచివాలయాల పరిధిలో పనిచేయాల్సి ఉంటుంది. దీని వలన గ్రామాల్లో రెవెన్యూ సమస్య పరిష్కారం చేయడంలో ఆలస్యం అవుతుందని వీఆర్వోలు వాపోతున్నారు. అలాగే మండలంలోని 8 రైతు సేవా కేంద్రాలను కూడా నాలుగు క్లస్టర్లగా ఏర్పాటు చేయనున్నారు. గతంలో నలుగురు ఉద్యానవన శాఖ అధికారులు, ముగ్గురు వ్యవసాయ శాఖ అధికారులు పనిచేసేవారు. ఇప్పుడు మోటుమల్లెల, గానుగచింత, రొంపిచెర్ల, బొమ్మయ్యగారిపల్లె గ్రామాలను క్లస్టర్లుగా ఎంపిక చేశారు. పెద్దమల్లెలకు వ్యవసాయ అసిస్టెంట్‌ను, గానుగచింత, రొంపిచెర్ల, బొమ్మయ్యగారిపల్లె క్లస్టర్లకు రెండు ఉద్యానవన అధికారులను, ముగ్గురు కాంట్రాక్ట్ సిబ్బందిని నియమించేందుకు సర్వం సిద్ధం చేశారు. మళ్లీ ఎంపీఈఓ పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిలో తీసుకునే అవకాశం ఉంది. మండలంలో 7,500 ఎకరాల్లో ఉద్యాన పంటలు, 4వేల ఎకరాల్లో వరి, వేరుశనగ, వివిధ రకాల వ్యవసాయ పంటలను రైతులు సాగుచేస్తున్నారు. అయితే 2024–25 సంవత్సరంలో పంట నమోదులో వ్యవసాయ శాఖ సిబ్బంది నిర్లక్ష్యం వలన వ్యవసాయ శాఖ సిబ్బంది పోస్టులు తగ్గించారని తెలిసింది. ఉద్యాన పంటలను పూర్తిస్థాయిలో పంట నమోదు చేసి వరి, వేరుశనగ, ఇతర వ్యవసాయ పంటల నమోదు తక్కువగా చూపారు. దీని కారణంలో మండలంలో వ్యవసాయ సిబ్బంది పోస్టులు కుదించేందుకు చర్యలు తీసుకుంటున్నారని సమాచారం. అలాగే లక్షలు ఖర్చు చేసి నిర్మించిన గ్రామ సచివాలయ భవనాలు నిరుపయోగం కానున్నాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు తగిన చర్యలు తీసుకుని ప్రజలు ఇబ్బంది పడకుండా క్లస్టర్ల ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఆలయ ముఖద్వార నిర్మాణానికి విరాళం



గౌరీ యూత్ సభ్యులకు చెక్ అందజేస్తున్న మురళీకృష్ణ

బంగారుపాళెం: మండలంలోని బొమ్మాయిపల్లెలో ఆలయ ముఖద్వార నిర్మాణానికి గురువారం మండలంలోని మాధవనగర్‌కు చెందిన సినీ హీరో మానినేని మురళీకృష్ణ (జెట్టి సినిమా ఫేం) బొమ్మాయిపల్లెలో గౌరీదేవి ఆలయ నిర్మాణానికి గురువారం రూ.లక్ష విరాళం అందజేశారు, గౌరీ యూత్ సభ్యులు వినతిపై స్పందించి ఈ విరాళం అందజేసినట్టు ఆయన చెప్పారు. అలాగే హండ్రెడ్ డ్రీమ్స్ ఫౌండేషన్ ఏర్పాటు చేసిన వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా స్థానిక ప్రభుత్వాస్పత్రి వద్ద ఐదేళ్ల నుంచి పేదలకు రోజూ మధ్యాహ్నం రూపాయకే భోజనం పెడుతున్నట్టు చెప్పారు.

జనాభా ప్రాతిపదికన నియమించాలి

చిత్తూరు అర్బన్: జనాభా ప్రాతిపదికన పారిశుద్ధ్య కార్మికులను నియమించాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నేతలు జోరేపల్లి రామచంద్రయ్య, ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు నాగరాజు అన్నారు. చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ కమిటీ సమావేశం గురువారం ఎస్టీయూ కార్యాలయంలో జయశంకర్ అధ్యక్షతన నిర్వహించారు. వారు మాట్లాడుతూ చిత్తూరు నగరం విస్తీర్ణం, జనాభాకు తగ్గట్టు పారిశుధ్య కార్మికులు లేరన్నారు. సిబ్బంది సంఖ్యను ప్రభుత్వం పెంచకపోవడం దారుణమన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు వెంటనే కార్మికులకు సోపు, చెప్పులు, యూనిఫాంతో పాటు ప్రతి కార్మికునికి కుట్టు కూలి మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. నేతలు మణి, బుర్ర మంజునాథబాబు, వాసు, జయశంకర్, సురేష్, వినాయక, సుగుణ, రమణి, సుకన్య, బుల్లెమ్మ చిత్ర, కస్తూరి పాల్గొన్నారు.

ఘనంగా తిరంగా ర్యాలీ



మానవహారంలో ప్రజాసంఘాల ప్రతినిధులు

పలమనేరు: జమ్ముకశ్మీర్‌లో ఉగ్రదాడి నేపథ్యంలో భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌లో విజయం సాధించిన నేపథ్యంలో సైనికులకు సంఘీభావంగా పట్టణంలో పీపీఎస్, మాజీ సైనికోద్యోగులు, ఏపీఎన్జీవోలు గురువారం ఘనంగా తిరంగా ర్యాలీ అనంతరం మానవహారం ఏర్పాటు చేశారు.

ఘనంగా హనుమజ్జయంతి



కుమ్మరపల్లెలో అలంకరణలో స్వామివారు



రాజనాలబండలో..



బైరెడ్డిపల్లెలో..



తాటిగుంటపాలెంలో ఆంజనేయస్వామి



పత్తి అలంకరణలో వీరాంజనేయస్వామి

పెద్దపంజాణి: రాయలపేట బసవేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని ఆంజనేయస్వామి ఆలయంలో గురువారం హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

సదుంలో..

సదుం: మండల కేంద్రంలోని గార్గేయ నదీ తీరం, కాలేజీ రోడ్డులో ఉన్న ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం స్వామి వారిని ప్రత్యేక వాహనంలో ఊరేగించారు. పలుచోట్ల అన్నదానం చేశారు.

కల్లూరులో..

పులిచెర్ల(కల్లూరు): కుమ్మరపల్లి, చల్లావారిపల్లెల్లో హనుమజ్జయంతిని ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకొన్నారు.

బైరెడ్డిపల్లెలో..

బైరెడ్డిపల్లె: నెల్లిపట్ల గ్రామ సమీపంలోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో గురువారం హనుమాన్ జయింతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

వి.కోటలో.

వి.కోట: పట్టణంలోని శ్రీవీరాంజనేయ స్వామి ఆలయంలో స్వామివారు పత్తి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి పూజల్లో పాల్గొన్నారు.

చౌడేపల్లెలో..

చౌడేపల్లె: రాజనాలబండ ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. చౌడేపల్లెలోని కమలాంజనేయస్వామి ఆలయంలో మూల విరాట్‌కు ప్రత్యేక పూజలు చేసి పురవీధుల్లో ఊరేగించారు.